## ప్రపంచ బౌద్ధ పటంలో నేలకొండపల్లికి ప్రత్యేక స్థానం




8 లో

- అంతర్జాతీయ బౌద్ధ వారసత్వ, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి
- పురావస్తు కట్టడాల పరిరక్షణ, పర్యాటక సదుపాయాలకు రూ.4.26 కోట్లు
- కంబోడియా, థాయ్‌లాండ్ బౌద్ధ భిక్షువులతో మాస్టర్ ప్లాన్‌పై చర్చలు
- 18 నెలల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యం

www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 14 | అక్టోబర్ | 2026
పేజీలు : 8






## ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో
# చెట్ల నరికివేత

- -రఘునాథగూడెం నాయకుడి హస్తం..?
- -పది చెట్లు మాయంపై అధికారులకు తెలియదా..?
- -ఫారెస్ట్, వన సంరక్షణ సమితి, ఎంపీడీవో, ఎంఈఓ, వెటర్నరీ కార్యాలయం ముందే మాయంపై చర్చలు
- -కేసు నమోదు



2 లో










# ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో చెట్లు నరికివేత




**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు లోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పది విలువైన చెట్లు శనివారం, ఆదివారం సెలవులు కావడంతో రాత్రి కాల సమయంలో కొందరు వ్యక్తులు వచ్చి ఆ 10 విలువైన చెట్లను కట్టర్ తో కట్ చేసుకుని ట్రాక్టర్ పై రఘునాథగూడెం తరలించినట్లు ప్రజల్లో చర్చలు కొనసాగుతున్నవి. కల్లూరు పట్టణంలో ఈ విధంగా ప్రజా ప్రభుత్వానికి సంబంధించిన చెట్లు అర్ధరాత్రి ధైర్యంగా ఓ రాజకీయ నాయకుని హస్తం తో ఈ పని జరిగినట్లు రాజకీయ పార్టీలలో చర్చలు కొనసాగుతున్నవి. రాజకీయ నాయకుని కి ఆ ధైర్యం ఎలా వచ్చింది? ఎవరు అనుమతితో చెట్లు నరికారు..? ఎవరు సలహాలు సూచనలు ఇచ్చారు. అతని వెనుక అండదండలు ఎవరివి అంటూ మండలంలో రాజకీయ పార్టీల నాయకులలో చర్చలు గుసగుసలు నడుస్తున్నవి. ఆ నోట ఈ నోట పడి అసలు ఎవరు అన్నది ప్రచారం ప్రజల్లో నడుస్తూ వస్తోంది. రఘునాథగూడెంలో ఆ పెద్దమనిషికి అండదండలు ఎవరు ఇచ్చారు. అంటూ అదే గ్రామంలో ప్రజలు చర్చించుకుంటున్నారు. కల్లూరులో కార్యాలయాలకు ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై తల్లాడ ఫారెస్ట్ రేంజర్ ను వివరణ కోరగా పది చెట్లు నరికిన మాట వాస్తవమేనని వాటి విలువ రూ 1.90 లక్షలు ఉంటుందని అంచనా వేశామని రఘునాథగూడెంకు చెందిన అనుమానస్పద వ్యక్తిపై కేసు నమోదు చేసి అట్టి స్వాధీన పరుచుకున్నామని పేర్కొన్నారు.

## కల్లూరులో చదరంగం పోటీలు




**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు లోని పీఎం శ్రీ గవర్నమెంట్ ఉన్నత పాఠశాల నందు ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి పోటీలను నిర్వహించి జిల్లా స్థాయి జట్ల ఎంపికలను మంగళవారం చేయడం జరిగిందని వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. ఐదుగురు బాలురను మరియు బాలికలను ఎంపిక చేసి తెలంగాణ రాష్ట్ర చదరంగం పోటీలు ఈ నెల 15, 16, 17 తేదీలలో హైదరాబాదులో నిర్వహించే పోటీలకు హాజరు పరుస్తున్నట్లు వివరించారు. ఇక్కడ నుంచి ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరిగిందని, 19 సంవత్సరాల లోపు ఎస్జీఎఫ్ సెక్రటరీ మూసా ఖయ్యూం ఆర్బిట్టర్ తల్లపురెడ్డి గౌతంరెడ్డి ఇక్కడికి వచ్చినట్లు క్రీడాకారులు అందరు కూడాను ఉచిత భోజన వసతి కల్పించినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొట్రు అర్జున్ రావు, కల్లూరు మండలం వ్యాయామం విద్య విభాగం వీర రాఘవయ్య, ఖమ్మం జిల్లా వారు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో బతుకమ్మ

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు లోని మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో మంగళవారం బతుకమ్మ ఆటలాడి తీరొకటి పువ్వులతో బుట్టలకు పేర్చి ఆటపాట కోలాటాలతో ప్రత్యేక పాటలతో నాట్యాలు వేస్తూ ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మోహన్ నాయక్, కమిషనర్ జి సాయి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు, వారి కుటుంబాలు మున్సిపాలిటీ కార్మికులు పాల్గొని ప్రత్యేక కార్యక్రమాల్లో ఉన్నారు. అనంతరం ఊరేగింపుతో ప్రదర్శనతో కల్లూరులోని సాగర కాలువలో బతుకమ్మలను వదిలారు.

## భూ రీ సర్వే పనులను గడువులోగా పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండలంలోని భూముల రిసర్వే పనులను పకడ్బందీగా మరియు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పి శ్రీనివాసరెడ్డి అధికారులకు ఆదేశించారు. రఘునాథగూడెం గ్రామంలో జరుగుతున్న భూ రీ సర్వే పనులను ఆయన మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే పనులను పురోగతిని సమీక్షించి సంబంధిత అధికారులకు సూచనలు సలహాలను చేశారు. త్వరితగతిన పూర్తి చేసి గడువులోగా సమాచారాన్ని అందించాలని అధికారులను కోరారు. ఆయన వెంట తహసిల్దార్ బ్రహ్మేశ్వరరావు కల్లూరు, తల్లాడ, పెనుబల్లి తహశీల్దార్లు పాల్గొన్నారు.

## అన్నపూర్ణాదేవి అలంకారంలో దుర్గామాత



**ప్రజాపక్షం/కారేపల్లి:** నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కారేపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాల్లో మంగళవారం అమ్మవారు అన్నపూర్ణాదేవి ఆలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మండపాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.



















# ఓట్ల తొలగింపు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం

**-రాజ్యాంగం కల్పించిన హక్కులను ఖూనీ చేస్తున్న బిజెపి**
**-జ్ఞానేష్‌కుమార్‌ను అరెస్టు చేయాలి**
**-ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జిఎస్టి కార్యాలయం ముట్టడి**




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఇటికాల రామకృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చింతల రమేష్ తెలిపారు. దేశ ప్రజలు ఓటు హక్కును కాపాడుకునేందుకు జరుగుతున్న పోరాటం మరో స్వాతంత్ర్య ఉద్యమం లాంటిదన్నారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఖమ్మం జిల్లా సమితుల ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలో గల కేంద్ర జిఎస్టి కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా అక్కడ ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. విద్యార్థి యువజన సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేసి టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ప్రధాన అధికారి జ్ఞానేష్‌కుమార్ బిజెపి ఏజెంట్‌ల వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఏకపక్ష నిర్ణయాలతో సర్ ప్రక్రియ ద్వారా దేశ వ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించడం రాజ్యాంగ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఢిల్లీలో ఓట్ల చోరీని నిరసిస్తూ శాంతియుతంగా ప్రజాస్వామ్యబద్ధంగా ధర్నా చేస్తున్న సిపిఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, వామపక్ష పార్టీలు, విద్యార్థి యువజన సంఘాలు, ప్రజాస్వామిక వాదులు, ప్రజాతంత్ర వాదులను అక్రమంగా అరెస్టు చేయడం రాజ్యాంగ హక్కులను హరించడమేనన్నారు. ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నం తగదన్నారు. జ్ఞానేష్‌కుమార్ తక్షణమే రాజీనామా చేయడంతో పాటు అరెస్టు చేయాలని లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మడుపల్లి లక్ష్మణ్, బురా మనోజ్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు శ్రవణ్, నాయకులు కిరణ్, ఉమా, భాను, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉగ్గం సురేష్, పవన్, గణేష్, కోటి, షమీర్, తేజా, ఉదయ్, నరేందర్, శ్రీరామ్ పాల్గొన్నారు.



## వేపకుంట్లలో ఉచిత వైద్య శిబిరం



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** మండల పరిధిలోని వేపకుంట్ల గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పొట్లపల్లి రమాదేవి రాజా ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో వృద్ధులకు, మహిళలకు, యువకులకు బిపి, షుగర్, టైఫాయిడ్, ఇతర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని తెలిపారు. ఇంటితో పాటు చుట్టు పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా అంటువ్యాధులు ప్రబలవన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అశ్వని, వైద్య సిబ్బంది లక్ష్మి, కృష్ణయ్య, ప్రమీల, రాణి, స్థానికులు యాలాద్రి, నాగేశ్వరరావు, కొండలరావు, పంచాయతీ సిబ్బంది శ్రీను, సందీప్ పాల్గొన్నారు.

## ఘనంగా మహాపడి పూజ అన్నదానం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీలోని హనుమాన్ సింగ్ నివాసంలో అయ్యప్ప స్వామి మహాపడి పూజ వేడుకలు మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో కన్నులపండుగగా నిర్వహించారు. గురుస్వామి గొలుసుల తిరుమలరావు ఆధ్వర్యంలో మహాపడి పూజ నిర్వహించారు. 60వ డివిజన్ రామన్నపేట అయ్యప్ప భక్తబృందం ఆధ్వర్యంలో మాల ధరించిన అయ్యప్పస్వాములు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు, భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహాపడి పూజ అనంతరం అయ్యప్పస్వాములకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.మహాపడి పూజ సందర్భంగా ఆ ప్రాంతమంతా అయ్యప్ప నామస్మరణతో మారుమ్రోగింది. ఈ కార్యక్రమంలో గురుస్వాములు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, చింతకాయల అంజయ్య, తాడబోయిన రాంబాబు, బరిగల శేఖర్, కట్ల నర్సింహారావు, బార్ అనిల్, బండి మనోజ్, ఐతనబోయిన వెంకట్రావు, ఏటుకూరి నవీన్, లక్ష్మణ్, కూచిపూడి మురళీ పాల్గొన్నారు.

## ఆసుపత్రికి రూ.53వేల వైద్య పరికరాలు



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** మండలంలోని ములకపాడు ఆసుపత్రికి రూ 53వేల విలువైన వైద్య పరికరాలను భద్రాచలం ఎంఎల్‌ఏ డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీవో బి రాహుల్ సహకారంతో మంగళవారం అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలను మెరుగుపరచాలనే ఉద్దేశంతో ఈ పరికరాలను సమకూర్చినట్లు ఎంఎల్‌ఏ తెలిపారు. ఈకార్యక్రమంలో మండల నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.
















# బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించాలి

**-రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర యువజన, సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణి ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో బతుకమ్మ వేడుకల నిర్వహణతో పాటు పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టు అమలు, నిధుల సమీకరణ, ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో భద్రత ఏర్పాట్లపై రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ పలు సూచనలు చేశారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేడుకలు జరిగే ప్రాంతాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాలు భద్రత కల్పించాలన్నారు. విస్తృత ప్రచారం కోసం ఫోటోలు, వీడియోలను సేకరించాలన్నారు. ప్రస్తుతం సూపర్ ఎల్‌నినో పరిస్థితులు, నీటి పొదుపు, పర్యావరణ పరిరక్షణపై బతుకమ్మ పాటల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాలకు బదిలీ చేసిన 56 పర్యాటక ప్రాజెక్టులలో ఖమ్మం జిల్లాకు 12 కేటాయించినట్లు తెలిపారు. ఈ పనులను ఇంజనీరింగ్ శాఖల సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రాజెక్టుల డిపిఆర్‌లను తయారు చేసి రెండు వారాల్లోగా పంపించాలన్నారు. అసంపూర్తిగా ఉన్న హరిత హోటళ్ల పూర్తికి పిపిపి విధానాన్ని పరిశీలించాలని, పర్యాటక ప్రాంతాల్లో భద్రత కోసం అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌వో రామ్మూర్తి, జిల్లా టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి పాల్గొన్నారు.

# యాసంగిలో ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** ఎలినినో ప్రభావం వలన నీటిలభ్యత తక్కువగా ఉంటుందని రైతులు దీనిని దృష్టిలో ఉంచుకొని యాసంగిలో ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని నీటిమీద ఆధారపడే పంటలు వేసుకోవద్దని వైరా ఏడిఏ కరుణశ్రీ అన్నారు. మండల పరిధిలోని మల్లుపల్లిలో మంగళవారం వరిపంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతు బోరుబావులు ఉన్న రైతులుకూడా ఆరుతడి పంటలే వేసుకోవాలని నీటిలభ్యత తగ్గుతుందని తెలిపారు. గ్రామానికి చెందిన కృష్ణార్జున్‌రావు అనే రైతు సుడోమోనస్, భవేరియా బేసిల్లస్ నానో యూరియా, నానో డిఏపి ని వాడి తక్కువ ఎరువులు, పురుగుమందులతో వరిపండించారని ఆ రైతును అభినందించారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బలాజీ, ఖమ్మం రైతు శిక్షణా కేంద్రం మండల వ్యవసాయ అధికారి భాస్కర్‌శరత్, రైతులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేయడం దుర్మార్గం

**రజకసంఘం వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నారపు**



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మెదక్ జిల్లాలో తెలంగాణ వీరనారి చిట్యాల ఐలమ్మ విగ్రహాన్ని ధ్వసం చేయడం దుర్మార్గమైన చర్యఅని ధ్వంసంచేసిన వారిని కఠినంగా శిక్షించాలని రజకసంఘం వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నారపు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. కొణిజర్లలో ఆయన మంగళవారం మాట్లాడుతు భూస్వాములను ఎదిరించి 10 లక్షల ఎకరాలు భూమిని పంపిణీచేయడంలో కీలకపాత్ర పోషించిన ఐలమ్మ విగ్రహాన్ని కూల్చివేయడం రాష్ట్రానికి అవమానకరమని అన్నారు. దీనిని రజకసంఘం జిల్లా కమిటి తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. లేకుంటే అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

# విచ్ఛిన్న శక్తులు ఎవరో తేల్చాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మున్నూరు కాపు సంఘంలో విచ్ఛిన్న శక్తులు ఎవరో తేల్చాలని ఖమ్మం జిల్లా మున్నూరుకాపు ఐక్య వేదిక నాయకులు తెలిపారు. మంగళవారం ఖమ్మంలో రాపర్తి శరత్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మున్నూరుకాపు సంఘం నాయకులు మాట్లాడుతూ మున్నూరుకాపు సంఘంలో విచ్ఛిన్న శక్తులు చేరి సంఘం కోసం జీవితం దారపోసిన వారిని విస్మరించి కేవలం పదవులు, ఆర్థికబలం ఉన్న నేతలను మోస్తూ వారికి అనుగుణంగా ఉన్న వారికి పదవులు కట్టబెడుతూ ఇష్టరీతిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిల్లా భౌగోళిక స్వరూపం తెలియని వారు పదవులు తీసుకుని వెలగబెట్టింది ఏమిటో చెప్పాలన్నారు. ఐదు నెలల క్రితం వేసిన కమిటీ, చేపట్టిన పనులు, చేసిన తీర్మానాలు తెలపాలన్నారు. పదవులు అలంకారం కోసం కాదని చిత్తశుద్ధితో పనిచేయాలని హితవు పలికారు. కొంత మంది తాము చెప్పిందే వేదం అన్నట్లుగా ప్రవర్తిస్తున్నారని కుల సంఘం ఏ ఒక్కరి సొత్తు కాదని ఎద్దేవా చేశారు. పదవులు పంచుకోవడానికి ఇది కుటుంబ ఆస్తి కాదన్నారు. కొందరు వ్యక్తులు అవలంభిస్తున్న ఒంటెద్దు పోకడలు నచ్చక తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. తమను విచ్ఛిన్నకర శక్తులు అన్నవారు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కుల పెద్దలతో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని త్వరలో జిల్లా, నగర కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ కార్పొరేటర్ రాపర్తి శరత్, శెట్టి రంగారావు, నర్సయ్య, మూలగుండ్ల శ్రీహరి, బైరిశెట్టి శ్రీనివాస్, గంగిశెట్టి శ్రీనివాసరావు, మాధంశెట్టి హన్మంతరావు, విప్లవ్ కుమార్ పాల్గొన్నారు.






# ఎస్‌బిఐటిలో ఘనంగా బతకమ్మ సంబురాలు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ వేడుకలను ఎస్‌బిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ తెలంగాణ ఆత్మ గౌరవాన్ని నిలబెట్టేలా ఊరు, వాడలలో బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తామని చిన్న పెద్ద తేడా లేకుండా ఈ వేడుకల్లో పాల్గొంటారన్నారు. ఈ వేడుకలను పురస్కరించుకుని వివిధ విభాగాల వారీగా సాంప్రదాయ వస్త్రధారణ పోటీలు, బతుకమ్మలను పేర్చే పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి మాట్లాడుతూ తెలంగాణకే ప్రత్యేకమైన పూల పండుగైన బతుకమ్మ వేడుకలను విద్యార్థుల సమక్షంలో జరుపుకోవడం ఎంతో ఆనందదాయకమన్నారు. తొమ్మిది రోజుల పాటు వివిధ పేర్లతో నిర్వహించే ఈ వేడుకలకు వివిధ ప్రాంతాలలోని వివిధ కథలతో ముడిపడి ఉందన్నారు. భావి తరాలకు మన సంస్కృతి సంప్రదాయాలను మరిచిపోకుండా ఉండేందుకు ఇలాంటి వేడుకలు దోహదపడతాయని వైస్ ఛైర్మన్ కె. శ్రీచైతన్య, ప్రిన్సిపాల్ డా॥ రాజ్‌కుమార్ తెలిపారు. వేడుకల సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు.ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బతుకమ్మ ఘాట్‌కు విద్యుత్ దీపాలు ఏర్పాటు

**ప్రారంభించిన సర్పంచ్ గడల కళావతి**



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిదిలోని తనికెళ్ల నర్సింహుల చెరుకు వట్టపై ఉన్న బీరప్పగుడివద్ద బతుకమ్మల నిమజ్జనం కోసం బతుకమ్మ ఘాట్‌ని ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీనుంచి బతుకమ్మ ఘాట్‌కు విద్యుత్ స్థంభాలు ఏర్పాటుచేసి వీధిదీపాలను అమర్చారు. వీధిదీపాలను గ్రామసర్పంచ్ గడల కళావతిభాస్కర్ మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతు త్వరితగతిన విద్యుత్ సౌకర్యం ఏర్పాటుచేసిన విద్యుత్‌శాఖ వైరా డిఈ రమేష్, ఏఈ భరత్ ఇతర సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామంలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు. పూలపండుగ ప్రకృతి మానవాళికి ఉన్న సంబంధాన్ని ఇంకా బలపరిచే పండుగ అని పేర్కొన్నారు. వర్షాభావం వల్ల రాబోయే కాలంలో సాగునీరుతోపాటు తాగునీరుకూడా కొరత ఏర్పడే ప్రమాదం ఉందని ప్రజలు నీటిని వృధా చేయొద్దని కోరారు. ఇంకుడు గుంతలను ఏర్పాటుచేసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో కొణిజర్ల మండల సిపిఐ కార్యదర్శి గడల భాస్కర్‌రావు, ఉపసర్పంచ్ చల్లా నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి బి రవికుమార్, మాజీ ఉపసర్పంచ్ చల్లా నరసింహారావు, బిజేపి జిల్లా కార్యవర్గ సభ్యులు తుప్పతి మల్లిఖార్జున్, మండల కార్యదర్శి కవిడమురళీ, వార్డు సభ్యులు తుప్పతి రవికుమార్, బాసా వెంకటేశ్వర్లు, గాజుల ప్రసాద్ రావు, బాసా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.




# భూ రీ సర్వే పనులను పకడ్బందీగా పూర్తి చేయాలి



**-అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి**
**-భూముల హద్దులు, విస్తీర్ణం, సర్వే వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలి**
**-రీసర్వేలో తప్పులకు తావులేకుండా పారదర్శకంగా భూ వివరాల నమోదు**

**ప్రజాపక్షం/పెనుబల్లి:** జిల్లాలో భూముల రీసర్వే పనులను పకడ్బందీగా, నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం పెనుబల్లి మండలం తుమ్మలపల్లి రెవెన్యూ గ్రామం, కల్లూరు మండలం రఘునాధగూడెం రెవెన్యూ గ్రామం, తల్లాడ మండలం లక్ష్మీపురం రెవెన్యూ గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే పనులను అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా గ్రామాల్లో సర్వే పనుల పురోగతిని సమీక్షించి, సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రీసర్వేలో భాగంగా భూముల హద్దులు, విస్తీర్ణం, సర్వే నంబర్లు తదితర వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. భూ రికార్డులోని వివరాలను క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోల్చి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నమోదు చేయాలని ఆదేశించారు.రీసర్వే ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, రైతులు, భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. భూములకు సంబంధించిన వివరాలపై అభ్యంతరాలు లేదా సందేహాలు వ్యక్తమైతే వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్వే బృందాలు సమన్వయంతో పనిచేస్తూ, నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు రీసర్వే పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, రోజువారీ పురోగతిని సమీక్షించాలని, పనుల్లో జాప్యం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ వెంట తల్లాడ, పెనుబల్లి, కల్లూరు తహశీల్దార్లు కె. కరుణాకర్ రెడ్డి, జి. వీరభద్ర నాయక్, కె. బ్రహ్మేశ్వర రావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేయాలి



**నాయకులు, కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే సండ్ర**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఖమ్మంనల్గొండవరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సత్తుపల్లి పట్టణ, మండల, వేంసూరు మండల ముఖ్య నాయకులతో నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో సండ్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టి రైతులు, గ్రామీణ ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పట్టభద్రుల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కేటీపీఎస్, మణుగూరు థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్వహణపై దృష్టి సారించాలని, సింగరేణి బొగ్గు వ్యవహారంపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. పట్టభద్రులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు, బీఆర్ఎస్ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ కూసంపూడి మహేష్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ శీలపురెడ్డి హరికృష్ణ రెడ్డి, బి ఆర్ ఎస్ నాయకులు దొడ్డా శంకరరావు, మోరంపూడి ప్రభాకర్, నడ్డి ఆనంద్ రావు, అమరవరపు కృష్ణారావు, వెదుళ్ళ నాగు, అజార్, పర్వతనేని వేణు తదితరులు పాల్గొన్నారు.

# అధిక సాంద్రత పద్ధతిలో పత్తిలో అధిక దిగుబడులు



**ప్రజాపక్షం/మధిర:** రైతులు ఆధునిక సాంకేతిక పద్ధతులను అవలంభిస్తూ అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేపడితే అధిక దిగుబడులు సాధించేందుకు దోహదపడుతుందని మధిర మండల వ్యవసాయ అధికారి సాయిదీక్షిత్ సూచించారు. మంగళవారం మాటూరుపేట గ్రామంలో రాశి సీడ్స్ వారి ఆధ్వర్యంలో మధిర మండల పరిసర గ్రామాల రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో భాగంగా రైతు మురళి పొలంలో అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేసిన రాశి సీడ్స్ పత్తి పంటను రైతులకు క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేసే రైతులు పంటను ఎప్పటిప్పుడు పరిశీలిస్తూ అవసరమైన యాజమాన్య చర్యలను సరైన సమయంలో చేపట్టాలని సూచించారు. పత్తి పంటకు అవసరమైన ఎరువులను పంట దశకు అనుగుణంగా సమతుల్యంగా వినియోగించాలని, నీటి యాజమాన్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. అదేవిధంగా పంటలో కలుపు మొక్కలు పెరగకుండా సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని, పురుగుల ఉనికిని ప్రారంభ దశలోనే గుర్తించి తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేస్తున్న రైతులు మొక్కల పెరుగుదల, పూత, కాయల అభివృద్ధిని నిశితంగా గమనిస్తూ తగిన యామాజన్య పద్ధతులను పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాశి సీడ్స్ కంపెనీ టెరిటరీ మేనేజర్ పవన్‌కుమార్, బాలకోటిరెడ్డి, ఏఈవోలు సుష్మా సిష్ట్న, రైతులతో పాటు కంపెనీ డీలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రామిక రాజ్య స్థాపనకు విప్లవ కమ్యూనిస్టు పార్టీ అవసరం




**సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ కేంద్ర కమిటీ నాయకురాలు**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** కార్మిక, రైతాంగ వర్గ ప్రయోజనాలే లక్ష్యంగా, మార్క్సిస్టు సిద్ధాంత ప్రాతిపదికన పనిచేసే విప్లవ కమ్యూనిస్టు పార్టీ అవసరమని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ కేంద్ర కమిటీ నాయకురాలు కె. రమ అన్నారు. మంగళవారం సత్తుపల్లిలో నిర్వహించిన పార్టీ రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల మూడో రోజు కార్యక్రమంలో కె. రమ, ఎం. కృష్ణ ప్రసంగించారు. సోషలిస్టు రాజ్య స్థాపన కోసం కమ్యూనిస్టు పార్టీలు సిద్ధాంత ఐక్యతతో ముందుకు సాగాలని, చర్చలు, ఆచరణ ద్వారా ఐక్యత సాధించాలని సూచించారు. కుల, మతాల పేరుతో పాలకులు శ్రామికవర్గ ప్రజలను విభజిస్తున్నారని విమర్శించారు. ఉత్పత్తి సంబంధాల్లో మార్పులు, పారిశ్రామిక అభివృద్ధి ద్వారానే కుల వ్యవస్థ నిర్మూలన సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. ఈ శిక్షణ తరగతుల కార్యక్రమాల్లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, గుమ్మడి నరసయ్య, కెచ్చల రంగారెడ్డి, గోకినేపల్లి వెంకటేశ్వర రావు, సీవై పుల్లయ్య, ఆవుల అశోక్, కె.కల్పన, జి.లలిత, కూకలకుంట రవి, అమర్లపూడి రాము, జి. ప్రభాకర్,నూపా భాస్కర్,గంటా శ్రీనివాసరావు,లాజర్,అమర్లపూడి శరత్ కాటినేని శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, గుమ్మడి నరసయ్య, కెచ్చల రంగారెడ్డితోపాటు రాష్ట్రంలోని 15 జిల్లాల నుంచి 200 మంది కార్యకర్తలు హాజరయ్యారు.

# వైరాలో దేవి నవరాత్రుల సందర్భంగా అన్నదానం



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో శివశంకర్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవి నవరాత్రుల మండపం వద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టిపిసిసి) ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ కలిసి ప్రారంభించారు. దేవి నవరాత్రుల సందర్భంగా భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రేచర్ల రామారావుతో పాటు శివశంకర్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పెద్దపల్లి రఘు, దేవరకొండ కిరణ్, బుడిగి శ్రీకాంత్, పెద్దపల్లి రాము, మిరియాల రవికిరణ్, పొన్నాడ కృష్ణతేజ తదితరులు పాల్గొన్నారు.

# అన్నపూర్ణదేవి అవతారంలో అమ్మవారు



**ప్రజాపక్షం/ ఏర్రుపాలెం :** తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన స్వయంభు జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు శ్రీ అన్నపూర్ణదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. . ఉదయం 5గంటల నుంచి నిత్య అర్చనలు, అనుష్ఠానములు, హోమాలు, మండపారాధనలు నిర్వహించారు. అలాగే ప్రత్యేక పూజలు ప్రధానర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలోశాస్త్రోక్తంగా నిర్వహించారు. అదేవిధంగా పద్మావతి ఆలయంలో దేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా అర్చకులు కాసులనాటి రామకృష్ణశాస్త్రి ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు, స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం సుమారు 500మంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, ముఖ్య అర్చకులు మురళీమోహన్‌శర్మ, మూర్తి వెంకటరమణ, రఘురామకృష్ణ శాస్త్రి, రాజీవ్‌శర్మ, వేద పండితులు, ఇతర ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు శిక్షణ కాలపు సంపాదిత సెలవులు మంజూరు



**ప్రజాపక్షం/మధిర:** టిపిఎస్‌యుటిఎఫ్ ఆధ్వర్యంలో మధిర మండల విద్యాశాఖ నందు పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ఇటీవల వినతి పత్రం అందించడం జరిగింది. పెండింగ్ సమస్యల్లో ప్రత్యేకంగా వేసవి సెలవుల్లో శిక్షణ కాలపు విషయమై వేగవంతంగా స్పందించి ఉపాధ్యాయులకు సంపాదిత సెలవు మంజూరు చేస్తూ సంబంధిత ఉత్తర్వులను మండల విద్యాశాఖ అధికారి శ్రీహరి విడుదల చేశారు. సకాలంలో ఉపాధ్యాయులకు సంపాదిత సెలవు మంజూరు చేసిన మండల విద్యాశాఖ అధికారి శ్రీహరికి ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్‌వలి, మండల అధ్యక్షులు బండారు నాగరాజు, ఉపాధ్యక్షులు షేక్ ఇబ్రహీం, కోశాధికారి బైర్ల చెన్నయ్య, కార్యదర్శి ఉట్ల కొండలరావులు ప్రత్యేకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ధన్యవాదాలు తెలిపిన వారిలో ప్రాంతీయ కార్యాలయం కన్వీనర్ ఏ.వినోదరావు, మధిర మండల ప్రధాన కార్యదర్శి ఈ.వీరయ్య, ప్రాంతీయ కార్యాలయం కోశాధికారి మహమ్మద్ రఫీ, మండల ఉపాధ్యక్షురాలు కాజా సునీత తదితరులు ఉన్నారు.

# మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడిగా పసుపులేటి వెంకట్



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండల పరిధిలోని ఖానాపురం గ్రామానికి చెందిన పసుపులేటి వెంకట్ మున్నూరుకాపు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు నియామకపత్రాన్ని అందించి ఘనంగా సన్మానించారు. సంఘం అభివృద్ధికి, సామాజిక ఐక్యతకు కృషి చేయాలనే లక్ష్యంతో ఆయనకు బాధ్యతలు అప్పగించడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. రాజ్యసభ సభ్యుడు, మున్నూరుకాపు సంఘం గౌరవాధ్యక్షుడు వద్దిరాజు రవిచంద్రతోపాటు ఆకుల గాంధీ, కొత్తా సీతారాములు, పొదిల రవికుమార్, సంఘ మాజీ అధ్యక్షుడు పారా తదితరులు నూతన బాధ్యతలు విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

# ఎన్నికల కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** దేశవ్యాప్తంగా ఓటర్ల తొలగింపు పేరుతో ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తున్న కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని సస్పెండ్ చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో కోట్లాది మంది ఓటర్ల హక్కులకు భంగం కలిగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తూ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఓట్ల తొలగింపునకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యవాదులు, లౌకికవాదులు, యువత చేస్తున్న పోరాటాలను అణచివేయాలని చూస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# పరిహారం..పరిహాసం..!

**-కలవరపడుతున్న మధ్యవర్తులు**
**-ముఖం చాటేస్తున్న రెవెన్యూ అధికారులు**



ప్రజాపక్షం/మణుగూరు: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని మణుగూరు ఓసి విస్తరణ జరిగిన భూ సేకరణ మయాజాలం రోజు రోజుకు పెరుగుతూ బట్టబయలు అవుతుంది. పట్టా దారు పాస్ పుస్తకం ఉండి నేటి వరకు రైతు బంధు అందుకుంటున్న రైతుల పేర్లు పరిహారం జాబితాలో లేవు కాని, అతని భూమిని అనుభవదారులగా చూపుతూ పదుల నుండి ఇరవై మంది బినామీల పేర్లు జాబితాలో దర్శనం ఇచ్చాయి. నా భూమిలో నా పేరు లేదు అని అధికారులను నిలదీస్తే దరఖాస్తు చేసుకొండి అంటూ సమాదానంతో రెవిన్యూ అధికారులు చేతులు దులుపుకున్నారు. మండల పరిధిలోని రామానుజవరం,తిర్లాపురం గ్రామాలలోని సర్వే నెంబర్ 853 లోని ప్రభుత్వ, ప్రవేటు 813 ఎకరాల భూముల సేకరణ ప్రారంభించగానే మధ్య దళారులు, రేవిన్యూ అధికారులు కలిసి అతి పెద్ద కుంభకోణానికి తెరలేపారు. 400 మంది నిర్వాసితులకు గాను 1506 మంది నిర్వాసితుల జాబితాలో చేర్చారు. నోటిపికేషన్‌కు ముందుగానే బినామీ పేర్లపై అనేక దరఖాస్తులు వచ్చినా వాటిని బుట్టదాఖాలు చేసి, వసూళ్ళ పర్వంలో మునిగి బినామీ పేర్లను నోటిఫికేషన్‌లు చేర్చి భారీ మొత్తలు జేబులో వేసుకున్నారు. నోటిఫికేషన్‌లో వచ్చిన నిర్వాసతులు జాబితాలో 1220 మంది బినామీలు ఉన్నారని ఆరోపణలు. ఈ బినామీల ఒక్కొకరి దగ్గరి నుండి 3 నుండి 4లక్షల వరకు వసూళ్ళు చేసి 35 కోట్లు జేబులో వెసుకున్నారు. గత పది రోజులుగా మీడియాలో వార్త కథనాలు వస్తున్న తరుణంలో పది రోజుల నుండి రెవిన్యూ అధికారి మోహం చాటేసి, దళారులను ఉసికొల్పి ధర్నాలు చేయండి అంటూ ఆదేశాలు ఇస్తున్నట్లుగా అరోపణలు వస్తున్నాయి.

**జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరపాలి...**

మణుగూరు ఓసి భూ సేకరణ మాయాజలం పై కలెక్టర్ వెంటనె స్పందించి సమగ్ర భూ సర్వే, విచారణకు ఆదేశించాలని నిర్వాసిత రైతులు కొరుతున్నారు. ప్రతి ఎకరం హక్కుదారులు, పట్టాదారు పాస్‌పుస్తకాలను పరిశీలించి నిజమైన నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలని, అక్రమాలకు పాల్పడిన అధికారులు, దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కొరుతున్నారు.

## చింతకుంటలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

**గ్రామాలను సందర్శించిన ఎంపీడీవో జమలారెడ్డి**



ప్రజాపక్షం/బూర్గంపాడు: పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు బూర్గంపాడు ఎంపీడీవో జమలారెడ్డి, హౌసింగ్ ఏఈ ఉదయ్ కిరణ్, మోతె గ్రామ పంచాయితీ సర్పంచ్ సూరమ్మ మంగళవారం మోతె పంచాయితీ పరిధిలోని చింతకుంట, శ్రీరాంపురం పాయం ఎస్టీ కాలనీలను సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి రోడ్లు, విద్యుత్, త్రాగునీరు తదితర మౌలిక వసతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చింతకుంట గ్రామంలో సుమారు 25ఏళ్లుగా నివసిస్తున్న ఆదివాసీ గిరిజనులకు ఇప్పటి వరకు అవసరమైన మౌలిక వసతులు అందలేదని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పలుమార్లు ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించినా సమస్యలు పరిష్కారం కాలేదని తెలిపారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో జమలారెడ్డి గ్రామస్తుల సమస్యలను ఉన్నతాధికారులు, ఎంఎల్ఏ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంల అవసరమైన వసతులపై సమగ్ర నివేదిక అందజేస్తామని తెలిపారు.

**బోరు నీటిని పరీక్షిస్తాం....**

గ్రామంలోని బోరు నీటిలో సుద్ద వస్తోందని, దీంతో ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని గిరిజనులు ఎంపీడీవోకు తెలిపారు. నీటి నమూనాలను పరీక్షించి సమస్యను గుర్తించి, స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని పంచాయితీ కార్యదర్శి సావిత్రిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో మోతె పంచాయితీ కార్యదర్శి సావిత్రి, ఉప సర్పంచ్ మోడెం రాధాకృష్ణ, బీఆర్ఎస్ నాయకుడు గుదే రామకృష్ణ, శ్రీరాంపురం పాయం ఎస్టీ కాలనీ గ్రామ పెద్ద సోడే చంద్రయ్య, చింతకుంట గ్రామ పెద్ద వేట్టి లక్ష్మయ్య, పోడియం సోలోమోన్, మడివి జోగయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రాజెక్టులో నీరున్నా ఎండుతున్న పంటలు

**-వెంగళరావుసాగర్ కుడి కాలువ ఆయకట్టు రైతుల ఆవేదన**
**-600 ఎకరాల వరి పంటను కాపాడాలని వేడుకోలు**



ప్రజాపక్షం/చంద్రుగొండ: ప్రాజెక్టులో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ సాగునీరు అందక వరి పంటలు ఎండిపోతున్నాయని వెంగళరావు సాగర్ ప్రాజెక్టు కుడి కాలువ ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రుగొండ మండలం సీతయ్యగూడెం గ్రామ పరిధిలోని వరి పొలాలకు నీరు అందకపోవడంతో రైతులు పొలాల్లోనే నిరసన తెలిపారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రాజెక్టు అలుగు మరమ్మతుల పేరుతో కుడి కాలువకు రావాల్సిన నీటిని వాగులోకి మళ్లించి వృథా చేశారని ఆరోపించారు. పంటలు ఎండిపోతున్న విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు తడుల నీరు అందించినా సుమారు 600 ఎకరాల్లో వరి పంట చేతికి వచ్చేదని తెలిపారు. వరి నాట్లు వేసే సమయంలో నీరు అందించలేమని ముందుగానే ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. వందల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుడి కాలువకు సాగునీరు విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు కోరారు.

## విద్యుత్ సరఫరాపై రైతులతో డీఈ ముఖాముఖి

**-లో వోల్టేజీ, విద్యుత్ అంతరాయాల సమస్యలపై ఆరా**



ప్రజాపక్షం/దుమ్ముగూడెం: భద్రాచలం విద్యుత్ డివిజన్ పరిధిలోని దుమ్ముగూడెం మండలం నర్సాపురం, సీతారాంపురం గ్రామాల్లో డివిజనల్ ఇంజనీర్(ఆపరేషన్స్)జీవన్ కుమార్ మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. వ్యవసాయ పొలాలను సందర్శించి రైతులతో ముఖాముఖి మాట్లాడి విద్యుత్ సరఫరా పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయానికి అందుతున్న విద్యుత్, లో వోల్టేజీ సమస్యలు, విద్యుత్ అంతరాయాలు, పంటల సాగు పరిస్థితులపై రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సీతారాంపురంలో మంజూరైన విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని రైతులు కోరారు. ప్రస్తుతం దుమ్ముగూడెం ఉప కేంద్రం నుంచి విద్యుత్ లైన్ దూరంగా ఉండటంతో తరచూ అంతరాయాలు, లో వోల్టేజీ సమస్యలు ఎదురవుతున్నాయని వివరించారు. కొత్త ఉపకేంద్రం అందుబాటులోకి వస్తే మెరుగైన విద్యుత్ సరఫరా లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా జీవన్ కుమార్ మాట్లాడుతూ విద్యుత్‌ను పొదుపుగా, అవసరమైన మేరకు వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సాగు ప్రణాళికలు రూపొందించుకోవాలని, రెండో పంట విషయంలో ప్రభుత్వ సూచనలు పాటించాలని కోరారు. వ్యవసాయ మోటార్ల వద్ద తగిన సామర్థ్యం గల కెపాసిటర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వీటి వల్ల పవర్ ఫ్యాక్టర్ మెరుగుపడి, విద్యుత్ వ్యవస్థపై ఒత్తిడి తగ్గడంతో పాటు వోల్టేజీ సమస్యలను కొంత వరకు నివారించవచ్చని వివరించారు. ఈ పర్యటనలో దుమ్ముగూడెం ఏఈ మోహన్‌రెడ్డి, నర్సాపురం లైన్‌మెన్ వెంకటేశ్వర్లు, సీతారాంపురం రైతులు పాల్గొన్నారు.

## అడవుల సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలి



ప్రజాపక్షం/చంద్రుగొండ: చంద్రుగొండ అటవీ పరిధిలోని మద్దుకూరు సెక్షన్, మద్దుకూరు ఈస్ట్ బీట్‌లో 30 హెక్టార్ల విస్తీర్ణంలో చేపట్టిన ప్లాంటేషన్‌ను చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్(సీసీఎఫ్) భీమా నాయక్, జిల్లా అటవీ అధికారి(డీఎఫ్ఓ)సిద్ధార్ధ్ విక్రమ్ సింగ్ మంగళవారం సందర్శించి పరిశీలించారు. ఈసందర్భంగా ప్లాంటేషన్ నిర్వహణ, అటవీ విస్తీర్ణం పెంపు, పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. అటవీ సంపదను కాపాడేందుకు ప్లాంటేషన్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని, అడవుల విస్తీర్ణాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని అధికారులు సూచించారు. అటవీ విధ్వంసానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో చంద్రుగొండ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కె తేజస్వి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కె లక్ష్మీ పతి, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

## సంతానలక్ష్మీ ఆలంకారంలో పర్ణశాల అమ్మవారు





ప్రజాపక్షం/దుమ్ముగూడెం: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా భద్రాచలం సీతారామచంద్రస్వామి అనుబంధ ఆలయమైన పర్ణశాల దేవాలయంలో రెండో రోజు మహాలక్ష్మీ అమ్మవారు సంతాన లక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి తరలివచ్చారు.

## సర్పంచ్ దంపతులకు ఎమ్మెల్యే పరామర్శ



-ప్రజాపక్షం/కారేపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న పాటిమీదిగుంపు సర్పంచ్ గుగులోత్ సుజాత, సంతోష్ దంపతులను గాదెపాడు సర్పంచ్, సింగరేణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూక్యా రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు సర్పంచుల పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈకార్యక్రమంలో సూర్యతండా సర్పంచ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు బానోత్ రాందాస్ నాయక్, సంఘం ఉపాధ్యక్షుడు మోతి వీరస్వామి, పేరుపల్లి సర్పంచ్ బానోత్ పద్మ వీరభద్రు, గేట్ కారేపల్లి సర్పంచ్ పూనం ఎల్లయ్య పాల్గొన్నారు. వైరా ఎంఎల్ఏ మాలోత్ రాందాసు నాయక్ వీడియో కాల్ ద్వారా సుజాత, సంతోష్ దంపతుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే స్వయంగా వచ్చి పరామర్శిస్తానని భరోసా ఇచ్చారు. సర్పంచులంతా వారికి అండగా నిలవాలని సూచించారు.

## కోటమైసమ్మ జాతర ఏర్పాట్ల పరిశీలన



ప్రజాపక్షం/కారేపల్లి: సింగరేణి ప్రాంతంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ కోటమైసమ్మ తల్లి జాతర ఈ నెల 20 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లపై దృష్టి సారించారు. జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో సింగరేణి సీఐ నూనావత్ సాగర్, ఎస్ఐ బైరు గోపి ఆలయ పరిసరాలను పరిశీలించారు. భక్తుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్‌కు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా వాహనాల పార్కింగ్‌కు అనువైన ప్రదేశాలను పరిశీలించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వారు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ పర్సా పట్టాభి రామారావు, ఈవో కె వెంకటయ్య తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు పగడాల మోహన్ కృష్ణ, పర్సా లలిత్‌సాయి, ప్రధాన అర్చకులు కొత్తలంక కైలాష్ శర్మ, భైరవభట్ల సాయిరాం శర్మ, తదితరులు పాల్గొన్నారు.

## దసరా వేళ మూడు కుటుంబాల్లో ఉద్యోగ వెలుగులు!



ప్రజాపక్షం/చుంచుపల్లి: దసరా పండుగ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ సీఈఓ బి.నాగలక్ష్మి మానవతా దృక్పథంతో వ్యవహరించడం అభినందనీయమని తెలంగాణ పంచాయతీ రాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు పులికంటి వెంకటేశ్వర్లు అన్నారు. పంచాయతీరాజ్ శాఖలో ఉపాధ్యాయులుగా, ఉద్యోగులుగా పనిచేస్తూ మరణించిన ముగ్గురు ఉద్యోగుల కుటుంబ సభ్యులు జీ.తరుణ్, పూర్ణచంద్రరావు, టి.వెంకటలక్ష్మి లకు కారుణ్య నియామకాల క్రింద ఆఫీస్ సబార్డినేట్లుగా ఉద్యోగ నియామక పత్రాలను అందజేసిన కార్యక్రమానికి పులికంటి వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ ప్రభుత్వానికి ఎన్నో సంవత్సరాలు సేవలందించి మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు అండగా నిలుస్తూ, కారుణ్య నియామకాలను త్వరితగతిన చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. ఉద్యోగ నియామకాలకు సంబంధించిన ఫైళ్లను పెండింగ్‌లో ఉంచకుండా, అర్హులైన కుటుంబ సభ్యులకు సకాలంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చొరవ చూపుతున్న జిల్లా పరిషత్ సీఈఓ బి.నాగలక్ష్మి కి తెలంగాణ పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ నియామకాలతో బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమం పట్ల అధికారులు ఇదే విధమైన మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ, అర్హులైన కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. దసరా పండుగ వేళ మూడు కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం ఆనందదాయకమని తెలిపారు.

# రూ.59 వేల కోట్ల బకాయిలపై సమరశంఖం



- నెలాఖరులోగా నిర్ణయం తీసుకోకుంటే బొగ్గు సరఫరా నిలిపివేత దిశగా ఉద్యమం
- ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్

ప్రజాపక్షం/మంచిర్యాల: సింగరేణి కాలరీస్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన సుమారు రూ.59 వేల కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'చలో హైదరాబాద్' కార్యక్రమం విజయవంతమైంది. సింగరేణి పరిధిలోని 12 డివిజన్ల నుంచి సుమారు 1450 మంది కార్మికులు, యూనియన్ నాయకులు తరలివచ్చి హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధను ముట్టడించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, ఏఐటీయూసీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యూసుఫ్, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి నరసింహ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.26 వేల కోట్లుగా ఉన్న బకాయిలు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.59 వేల కోట్లకు చేరాయని ఆరోపించారు. ఈ నెలాఖరులోగా బకాయిల చెల్లింపుపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, అవసరమైతే జెన్‌కో, ట్రాన్స్‌కోకు బొగ్గు సరఫరా నిలిపివేత దిశగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్మికుల హక్కులు, సింగరేణి ఆర్థిక స్థిరత్వం కోసం ఏఐటీయూసీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. విద్యుత్ ఉత్పత్తికి బొగ్గు ఎంత అవసరమో, బొగ్గును ఉత్పత్తి చేసే సింగరేణి సంస్థ ఆర్థిక స్థిరత్వం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. 12 డివిజన్ల నుంచి సుమారు 1450 మంది కార్మికులు, నాయకులు తరలివచ్చి ముట్టడి కార్యక్రమంలో పాల్గొనడం యూనియన్‌పై కార్మికులకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమని వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జనరల్ సెక్రెటరీ మిర్యాల రంగయ్య, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు ముస్కే సమ్మయ్య, మద్ది ఎల్లయ్య, కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, బ్రాంచ్ కార్యదర్శులు ఎస్.వి.రమణమూర్తి, జక్కుల గట్టయ్య, సముద్రాల సుధాకర్, బాజీ సైదా, మోట పలుకుల రమేష్, ఎమ్మార్సీ రెడ్డి, రాంగోపాల్, శైలేంద్ర సత్యనారాయన, దాగం మల్లేష్, సుధాకర్, నజీర్, రంగు శ్రీనివాస్, గంధం సాంబశివరావుతోపాటు అన్ని ఏరియాల కార్యవర్గ సభ్యులు, వివిధ కమిటీల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# కన్నబిడ్డకు అనారోగ్యం

- తల్లిదండ్రులకు తీరని వేదన
- రూ. 15 లక్షలు ఖర్చు చేసిన నయం కాని వ్యాధి
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు





ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : కన్న కూతురి అనారోగ్యం ఆ తల్లిదండ్రులకు తీరని వేదనగా మారింది. బిడ్డను కాపాడుకునేందుకు లక్షలాది రూపాయలు ఖర్చు చేసిన పరిస్థితి మెరుగుపడ లేదు. నెల నెల మందుల కోసం వేల రూపాయలు ఖర్చు చేస్తూ కూతురిని కాపాడుకునేందుకు ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటుంది. వివరాల్లోకి వెళితే... కారేపల్లి గ్రామానికి చెందిన గుగులోత్ శరణ్య రమేష్ దంపతులు ప్రస్తుతం రఘునాథపాలెం మండలం వేపకుంట్లలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. యశస్వికి ఆరు సంవత్సరాలు, ప్రజ్ఞకు మూడు సంవత్సరాలు. పెద్ద కుమార్తె యశస్వికి 14 నెలల వయస్సు ఉన్నప్పుడు మెదడు సంబంధిత సమస్య తలెత్తింది. దీనితో నడవలేని స్థితి ఏర్పడి కాళ్లు, నడుము, మెడ భాగాలు చచ్చుపడిపోయాయి. కనీసం తన పనులు తాను చేసుకునే పరిస్థితి లేక మంచానికే పరిమితమైంది. నిరుపేద కుటుంబమైనా కన్నబిడ్డకు వచ్చిన వ్యాధిని నయం చేయించేందుకు ఖమ్మం, హైదరాబాద్‌లోని పలు ప్రైవేటు ఆసుపత్రులతోపాటు వరంగల్ ఎంజిఎం ఆసుపత్రిలోనూ చికిత్స చేయించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కుమార్తెను కాపాడుకునేందుకు అప్పులు చేసి మరి సుమారు రూ. 15 లక్షల వరకు ఖర్చు చేసిన ఆరోగ్యం కుదుట పడలేదని ఆ దంపతులు కన్నీరు మున్నీరు వుతున్నారు. ప్రస్తుతం మందుల ఖర్చు కోసం నెలకు ఆరువేల వరకు అవుతుందని వాపోయారు. తండ్రి రమేష్ సుతారి పని చేస్తూ వచ్చే అరకొర ఆదాయంతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వైద్య ఖర్చులు మోయలేని భారంగా మారాయని ప్రభుత్వం స్పందించి పింఛన్, ఇల్లు మంజూరు చేసి ఆదుకోవడంతో పాటు తన కుమార్తెను కాపాడాలని వేడుకుంటున్నారు.

# ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

-కమిషనర్ అభిషేక్ అగస్త్య



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : వెలుగుమట్లలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులను ఆదేశించారు. మంగళవారం వెలుగుమట్లలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటి నిర్మాణ పనులను పరిశీలించి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు, ఇంకా నిర్మాణాలు ప్రారంభించని వారితో కమిషనర్ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేసేలా కార్యాచరణతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. ఇండ్ల నిర్మాణానికి సంబంధించి లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక సూచనలు, ప్రభుత్వ మార్గ దర్శకాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఇంటి నిర్మాణ పురోగతిని క్రమం తప్పకుండా నమోదు చేయాలని, పనులు ప్రారంభం కాని ఇండ్లపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు పథకం ప్రయోజనాలు సకాలంలో అందేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సర్వేకు గ్రామస్తులు సహకరించాలి

-గ్రామసభలో ఆర్డీవో శ్రీనివాస్



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : పువ్వాడ నగర్ గ్రామ పంచాయతీలో చేపట్టే ఇండ్ల స్థలాల సర్వేకు గ్రామస్తులు ఎటువంటి అపోహలు, భయాందోళనలు చెందకుండా సహకరించాలని ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్ తెలిపారు. ఇండ్ల స్థలాల సర్వేకు సంబంధించి గ్రామస్తులకు అవగాహన కల్పించేందుకు మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో ఆర్డీవో శ్రీనివాస్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు పువ్వాడ నగర్‌లో ఇండ్ల స్థలాల సర్వే ఏడు బృందాల ఆధ్వర్యంలో బుధవారం నుంచి చేపట్టనున్నట్లు తెలిపారు. 2009, 2016లో ప్రభుత్వం కోయచలక సర్వే నెం. 192లో సుమారు రెండువేల మందికి ఇండ్ల పట్టాలు పంపిణీ చేసిందన్నారు. ప్రస్తుతం ఇక్కడ ఉంటున్న వారి వివరాలను సేకరించనున్నట్లు తెలిపారు. సర్వే బృందాలకు గ్రామస్తులు సహకరించి తమ వివరాలను అందించాలన్నారు. పట్టాదారులు ఇండ్లు నిర్మించుకుని నివసిస్తున్నారా , స్థలాలు కొనుగోలు చేసి నివసిస్తున్నారా, ఖాళీ స్థలాలు ఉన్నాయా వంటి వివరాలను సేకరించనున్నామన్నారు. తమ వద్ద ఉన్న పత్రాలతో పాటు ఆధార్‌కార్డు, ఓటరు ఐడి, ఫుడ్ రేషన్ కార్డు తదితర వాటిని అందించాలని సూచించారు. కేవలం ప్రాథమిక సర్వే మాత్రమే చేస్తున్నామని ఎవరిని తొలగించమని గ్రామస్తులు ఎటువంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జిపివో, ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు ఒక బృందంగా మొత్తం ఏడు బృందాలు సర్వే చేపడతాయన్నారు. వీటిని ఆర్ఐలు పర్యవేక్షిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, ఎంపిడివో అశోక్ కుమార్, సర్పంచ్ సిద్దిఖ్, రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కెఎంసిలో బతుకమ్మ వేడుకలు



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మంగళవారం కార్యాయంలో నిర్వహించిన సంబురాల్లో మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళా ఉద్యోగులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి సాంప్రదాయబద్ధంగా వేడుకలను నిర్వహించారు. ఆటపాటలతో సందడి చేశారు. అధికారులు, వివిధ విభాగాల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విష్ణు సహస్ర నామ పారాయణం



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలోని అల్లిపురం కొత్తగూడెం రోడ్డులో నిర్మించతలపెట్టిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ ప్రాంగణంలో విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు. మంగళవారం భూమిపూజ చేసిన ప్రాంతాన్ని వేలాదిగా భక్తులు సందర్శించి పూజలు నిర్వహించారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో 100 మంది భక్తులు విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. ఈ సందర్భంగా సొసైటీ ఛైర్మన్ రావూరి సైదుబాబు మాట్లాడుతూ ఆలయ నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రతి రోజు ఇక్కడ పూజలు, పారాయణం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాంతానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని వసతులు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

# ఎస్సై యయాతి రాజు బదిలీ

ప్రజాపక్షం/ అశ్వారావుపేట : అశ్వారావుపేట ఎస్సై యయాతి రాజు బదిలీ అయినట్లు జిల్లా పోలీస్ కార్యాలయం నుండి ఉత్తర్వులు జారీ అయ్యాయి. గత రెండు సంవత్సరాలుగా పనిచేసిన యయాతి రాజు మండలంలోని శాంతిభద్రతలతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించారు. ప్రజలతో ఫ్రెండ్లీ పోలీసింగ్, మత్తు పానీయాలు నిషేధంపై ప్రత్యేకంగా సదస్సులు నిర్వహించడంతో పాటు నేరాల నియంత్రణ కోడి పందాలు, జూదం లాంటి కార్యక్రమాలను తనదైన శైలిలో అడ్డుకుని ప్రజలకు ఎప్పుడు ఎల్లవేళలా సేవలు అందించిన వ్యక్తిగా పలువురు మన్ననలను పొందారు. నూతనంగా వస్తున్న ఎస్సై సాయికిరణ్‌రెడ్డి ఇక్కడే ట్రైనీ పొంది కొన్ని రోజుల పాటు బాధ్యతలు కూడా స్వీకరించి పక్క మండలం దమ్మపేటలో ఎన్నికల ముందు తర్వాత కూడా సుదీర్ఘకాలంగా పనిచేశారు. బదిలీపై ఇక్కడి వస్తున్న ఎస్సై కిషోర్‌రెడ్డి కూడా ఈ ప్రాంతం పట్ల మంచి అవగాహన ఉంది.

# సోలార్ ప్లాంట్‌లో మరోసారి కేబుల్స్ చోరీ..!

- రూ.10లక్షల విలువైన కేబుల్స్ అపహరణ



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం రాజుపాలెం గ్రామంలో మణితేజ, లక్ష్మీ 2.4 మెగా వాట్ల సోలార్ ప్లాంట్‌లో మరోసారి కేబుల్స్ చోరీ ఘటన కలకలం రేపింది. సుమారు రూ.10లక్షల విలువైన కేబుల్స్ అపహరణకు గురైనట్లు ప్రాజెక్టు నిర్వాహకులు తెలిపారు. ఈఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ప్లాంట్‌లోని 200మీటర్ల ఆర్ఎస్ 485 కేబుల్‌తో పాటు, 2వేల మీటర్ల పాలిక్యాబ్ 6ఎస్‌క్యూఎంఎం డిసి కేబుల్స్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బాధితులు పేర్కొన్నారు. గతంలోనూ ఇదే ప్లాంట్‌లో సుమారు 6 నెలల క్రితం రూ.5లక్షల విలువైన డిసి కేబుల్స్ చోరీ గురయ్యాయని తెలిపారు. అప్పట్లో సంబంధిత అధికారులకు సమాచారం అందించినప్పటికీ ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోకపోవడంతోనే మరోసారి చోరీ జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్వచ్ఛమైన పర్యావరణ హితమైన విద్యుత్‌ను ఉత్పత్తి చేసి సమాజానికి అందించాలనే లక్ష్యంతో సోలార్ ప్లాంట్‌ను నిర్వహిస్తున్నామని బాధితులు తెలిపారు. అయితే వరుస చోరీల కారణంగా భారీ ఆర్థిక నష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేబుల్స్ అపహరణతో విద్యుత్ ఉత్పత్తికి కూడా అంతరాయం ఏర్పడుతోందని పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరిపించి చోరీకి పాల్పడిన వారిని గుర్తించాలని బాధితులు కోరారు. చోరీకి గురైన కేబుల్స్‌ను రికవరీ చేసి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్లాంట్‌కు తగిన భద్రత కల్పించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

# మనస్పర్ధలతో ఆత్మహత్య చేసుకున్న యువజంట







ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : నెల క్రితమే ప్రేమ వివాహం చేసుకున్న యువజంట మనస్పర్ధల కారణంగా ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. మండల కేంద్రం ఎర్రుపాలెంకు చెందిన మహేష్, ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలానికి చెందిన వెంకటరమణ గత ఐదేళ్లుగా ప్రేమించుకున్నారు. ఇటీవల నెల క్రితమే ప్రేమ వివాహం చేసుకోగా వివాహ అనంతరం దంపతుల మధ్య మనస్పర్ధలు రావడంతో మనస్థాపానికి గురైన భార్య వెంకటరమణ ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలంలోని అమ్మమ్మ ఇంటి వద్ద రెండు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న భార్య మహేష్ భార్య మృతిని తట్టుకోలేక ఎర్రుపాలెం రైల్వేగేటు సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో వీరి కుటుంబాల్లో విషాదచాయలు అలుముకున్నాయి. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

